## క్లుప్తంగా

### సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపొద్దు



ద్విచక్ర వాహనదారుడి సెల్‌ఫోన్‌ను లాక్కుంటున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి రూరల్: సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని వాహనదారులకు బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక సీహెచ్‌సీ వద్ద ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ స్కూటీపై వెళ్తుండడాన్ని ఆయన గమనించి, ఆపి సెల్‌ఫోన్‌ను లాక్కుని కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యంతాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని తెలిపారు. మరోసారి ఇలా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### శ్మశానానికి రోడ్డు వేయండి



తహసీల్దార్ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న పాములవలస గ్రామస్తులు

తెర్లాం: గ్రామంలోని శ్మశానవాటికకు వెళ్లేందుకు రోడ్డు వేయాలని మండలంలోని పాములవలస గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు స్థానిక తహసీల్దార్ రాజ్యలక్ష్మిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మరణించిన వారిని శ్మశానవాటికకు తరలించడం కష్టమవుతోందని తెలిపారు. శ్మశానవాటికతో పాటు పొలాలకు కూడా వెళ్లేందుకు రోడ్డు సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు దత్తి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే బేబీ నాయనకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బొబ్బిలి: విద్యారంగంలో నెలకొన్న ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, మణికుమార్‌లు ఎమ్మెల్యే బేబీ నాయనను పట్టణంలోని కోటలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణం నుంచి ఒకటిన్నర కిలోమీటరు దూరంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని, కోమటిపల్లిలోని బీసీ బాలురు వసతిగృహాన్ని పట్టణానికి తరలించాలన్నారు. అలాగే మెస్ బిల్లులు విడుదల చేయాలని, సీబీఎం బాలికల ఉన్నత పాఠశాలను రెన్యువల్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం విద్యారంగానికి కేటాయించి, విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

### పోరాం సర్పంచ్ మృతి



వీరమ్మ(ఫైల్)

మెంటాడ: మండలంలోని పోరాం గ్రామ సర్పంచ్ రాగోలు వీరమ్మ శనివారం మృతి చెందారు. గత నాలుగు రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను చికిత్స నిమిత్తం విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే ఉండి చికిత్స పొందుతుండగా ఉదయం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల మాజీ మంత్రి, మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జెడ్పీటీసీ ఎల్.సన్యాసి అప్పలనాయుడు, ఎంపీపీ ఆర్.సన్యాసినాయుడు, మండల కన్వీనర్ ఆర్. రామారావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాంబాబు, తదితరులు కూడా సర్పంచ్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

### జాగ్రత్తలు పాటించండి

గజపతినగరం రూరల్: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. మర్రివలస పంచాయతీ పరిధిలోని సిగడంవలస, రాయివలస, ఏనుగులవలస గ్రామాల్లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది శనివారం పర్యటించారు. ఆయా గిరిజన గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద టబ్బులు, గోళాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు దోమల వల్లే వస్తాయని, దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ఖాళీగా వదిలేసిన టైర్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాల చిప్పల్లో దోమలు వృద్ధి చెందుతాయని, నివాస సాల మధ్య వాటిని లేకుండా చూసుకోవాలని చెప్పారు.

# నీటమునిగిన పంటపొలాలు



సంతకవిటి: మల్లయ్యపేట వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు



వంగర: మగ్గూరులో నీటమునిగిన వరిపంట పొలాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి, బలపడిన నేపథ్యంలో మూడురోజులుగా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, పొలాలు జలమయమయ్యాయి. చాలాచోట్ల పొలాల్లో వరిఉబాలు వేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎక్కువసేపు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూస్తే నష్టముండదని అన్నదాతలకు అధికారులు ధైర్యం చెబుతున్నారు.

–సంతకవిటి, వంగర



వంగర: కొప్పరలో పంటపొలాల్లో చేరిన వరదనీరు



సంతకవిటి: చింతలపేట వద్ద ఉన్న చప్టా మీదుగా ప్రవహిస్తున్న వర్షంనీరు

# అప్రమత్తంగా ఉండాలి



కాలువల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలని చెబుతున్న సర్పంచ్ విజయబాబు

తెర్లాం: వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, కూనాయవలస సర్పంచ్ బొడెల విజయబాబు అన్నారు. మండలంలోని కూనాయవలస గ్రామంలో దోమల నివారణకు మందు స్ప్రే చేయించడంతో పాటు సీజనల్ వ్యాధులు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి స్వామి, వైద్యారోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఆయన.. ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. సురక్షితమైన నీటినే తాగాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లి, వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

# విద్యార్థులకు వైద్య పరీక్షలు



నేరళ్లవలసలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దిలీప్‌కుమార్

రామభద్రపురం: మండలంలోని అన్ని వసతిగృహాల్లోని విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. నేరళ్లవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్యాధికారి దిలీప్‌కుమార్ వైద్య పరీక్షలు చేయగా, స్థానిక సంక్షేమ బాలురు వసతిగృహంలో వైద్యాధికారిణి ఏఎల్‌జి శిరీష వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులు కూడా అందజేశారు. అలాగే వాతావరణంలోని మార్పులతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వాటి బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని, భోజనానికి ముందు తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, ప్రతిరోజూ స్నానం చేయాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉన్నప్పుడే ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్. వాసుదేవరావు, కోటి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పికెట్ ఏర్పాటు



రేగిడి: కె.వెంకటాపురం నాగావళి నది పోలీసుల పహారా



సంతకవిటి: తమరాం నాగావళి వద్ద కాపలాగా ఉన్న పోలీసులు

సంతకవిటి: మండలంలోని తమరాం, మేడమిర్తి గ్రామాల వద్ద నాగావళి నది ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

రేగిడి: మండలంలోని కె.వెంకటాపురం సమీపంలోని నాగావళి నదీతీరం నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా పోలీస్ పహారా ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపడుతున్నామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంకిలి, రేగిడి ప్రాంతాల్లోని నదీతీరాల వద్ద కూడా పోలీసులను కాపలాగా ఉంచినట్లు పేర్కొన్నారు.

## డాక్టర్ సత్యారావు మృతి వైద్యరంగానికి తీరని లోటు



సత్యారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

• జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: డాక్టర్ రెడ్డి సత్యారావు మృతి చాలా బాధాకరమని, ఆయన మరణం వైద్యరంగానికి తీరని లోటు అని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ డిప్యూటీ కో–ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పట్టణంలోని సత్యారావు స్వగృహానికి శనివారం వెళ్లిన జెడ్పీ చైర్మన్ అక్కడి సత్యారావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులైన డాక్టర్ రెడ్డి రవికుమార్, శ్రీనివాసరావు, లక్ష్మీప్రసాద్, శేషులను కలిసి, పరామర్శించి ఓదార్చారు. చుట్టుపక్కల ప్రాంతాలు, గ్రామంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, విశేష సేవలందించారని, ఎంతోమంది ప్రాణాలను తన వైద్యసేవల ద్వారా కాపాడారని సత్యారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జి శంబంగి వేణుగోపాలనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, రామభద్రపురం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశినాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు), జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి పాల్గొన్నారు.

# రోడ్లు బాగుచేయరూ?



పిరిడి గ్రామ జంక్షన్ రోడ్డులో ప్రమాదరకంగా గుంత



కారాడ, అలజంగి గ్రామాల మధ్య గుంతలమయమైన రోడ్డు

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లోని రోడ్లు చాలా అధ్వానంగా ఉండడంతో రోడ్లు బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. గుంతలమయమైన రోడ్లు ఏ చిన్నపాటి వర్షం కురిసినా బురదమయం కావడంతో వాహనదారులు, పాదచారులు రోడ్ల మీదుగా ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షపునీరు రోడ్డుపై ఉండే గుంతలో నిలిచిపోవడంతో ఏది గొయ్యి.. ఏది రోడ్డు సమాంతరమో తెలియడం లేదని, ఒక్కోసారి వాహనాలు గుంతలో పడి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు బాగుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొద్దాం గ్రామ సచివాలయ సిబ్బందితో శనివారం సమావేశమైన ఆయన.. పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని, వీధులు, కాలువల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని, కాలువలు, రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరై, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

## చురుగ్గా పారిశుధ్య పనులు



రేగిడి: వన్నలిలో సర్పంచ్ రమణ పర్యవేక్షణలో జరుగుతున్న పారిశుధ్య పనులు

రేగిడి: మండలంలోని వన్నలి, అంబకండి, ఉనుకూరు, చిన్నశిర్లాం, బూరాడ గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. వీధులను శుభ్రం చేయడంతో పాటు కాలువల్లో పూడికలు తొలగించడం, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయడం వంటివి చేపట్టారు. అనంతరం చెత్తను గ్రీన్ అంబాసిడర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించారు.

రాజాం: మండలంలోని ఆగూరు, అమరాం, దోసరి, పెనుబాక, గడిముడిదాం తదితర గ్రామాల్లో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల్లోని నీరు, చెత్తచెదారం తొలగించి, డంపింగ్‌యార్డులకు తరలించారు.

## వరుస క్రమంలో వరినాట్లు వేయాలి



చాటాయవలసలో వరినాట్లు వేయడంపై అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ



ఉంగరాడలో బీజామృతంతో వరినారు శుద్ధి చేయడాన్ని తెలియజేస్తున్న సిబ్బంది

రేగిడి: రైతులు వరినాట్లు వేసేటప్పుడు సరైన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో వరినాట్లు వేసే విధానంపై శనివారం అవగాహన కల్పించారు. పద్ధతి ప్రకారం వరుస క్రమంలో వరినాట్లు వేస్తే పంటకు బాగా గాలి, వెలుతురు తగిలి, పంట ఏపుగా పెరుగుతుందన్నారు. అలాగే వరినారు వేసేముందు నారు చివరి భాగాన్ని తొలగించి, నాటుకోవాలన్నారు. ఎకరాకు 5 కిలోల యూరియా, 5 కిలోల డీఏపీని దమ్ములో వేసుకుని, నాట్లు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో బీజామృతంతో వరినారు శుద్ధి చేసుకోవడంపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 సురేష్ మాట్లాడుతూ వరినాట్లు వేసుకునేటప్పుడు నారు చివరి భాగం తొలగించి, నాటుకోవాలని ఇలా చేయడం ద్వారా పంటకు హాని చేసే పురుగులు తొలగిపోతాయన్నారు. నారు చివరి భాగం తొలగించకుండా నాటితే ఆ పురుగులు అలాగే ఉండి గుడ్లు పెట్టి పంటను పాడుచేస్తాయన్నారు. బీజామృతంతో నారును శుద్ధి చేసుకోవడం ద్వారా నారువేళ్లల్లో ఉండే ఫంగస్ నాశనమై పంటకు రక్షణ కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు రవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

రాజాం: పట్టణంలోని శివం సత్యసాయి మందిరంలో ఆదివారం నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సుప్రభాతసేవ, నగర సంకీర్తన, 8.30 గంటలకు షిర్డీసాయికి క్షీరాభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు నామసంకీర్తన, అనంతరం కొల్లా శాంతిచే సంగీత కచేరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలకు పెద్దఎత్తున భక్తులు హాజరుకావాలని కోరారు.

### పత్తిపంట సాగుపై రైతుల ఆసక్తి



గడిముడిదాం సమీపంలో సాగు చేస్తున్న పత్తి పంట

రాజాం: మండలంలోని గడిముడిదాం, సీఎస్ఆర్ పురం, ఆగూరు, అమరాం, దోసరి, కంచరాం, బొమ్మినాయుడువలస తదితర గ్రామాల్లో పత్తిపంట సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలో మొత్తం 300 ఎకరాల్లో ప్రస్తుతం పత్తిపంట సాగుకు రైతులు సిద్ధమైనట్లు ఏవో రేనుకాసాయి తెలిపారు.

### వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

వంగర: మండలంలోని కె.కొత్తవలసలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేమకోటి రమాకాంత్‌శర్మ ఆధ్వర్యంలో కె.కొత్తవలస, కొప్పర, కొండచాకరాపల్లి, కొప్పరవలస, కొట్టిశ, లక్ష్మీపేట గ్రామాలకు చెందిన భక్తులు ఈ పూజల్లో పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వేడుకున్నారు.

### కుష్టు వ్యాధి లక్షణాలుంటే తెలియజేయండి



సంకిలిలో సర్వే చేస్తున్న సిబ్బంది

రేగిడి: కుష్టు వ్యాధి లక్షణాలతో ఎవరైనా బాధపడితే తెలియజేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఆసిరినాయుడు కోరారు. మండలంలోని సంకిలి గ్రామంలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం శనివారం సర్వే చేపట్టారు. చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని మచ్చలు, కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, చేతులు, పాదాలు తిమ్మిర్లు కలిగి ఉండటం వంటి లక్షణాలతో ఉన్న వారిని గుర్తించే ప్రయత్నం చేశారు. ఈ లక్షణాలు ఎవరిలోనైనా ఉంటే వైద్యులను సంప్రదించి, చికిత్స పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.వి.అప్పారావు, ఏఎన్ఎం టి.జ్యోతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

